క్లుప్తంగా

వినాయకుని సేవలో తిరుపతి కలెక్టర్



కలెక్టర్ వెంకటరమణారెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా కాణిపాకం విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

నేడు బండపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: మండలంలోని బండపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సుకన్య తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. గర్భిణులు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె పేర్కొన్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి ఇంటివద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ధర్మ మార్గాన్ని అనుసరించాలి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని ఊటువంక గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై బంగారుపాళెం-2 ప్రబోధసేవా సమితి కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు ధనుంజయ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచారి జయంతి రేపు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో మంగళవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొగిలీశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఉదయం 8 గంటలకు బ్రాహ్మణ కుటుంబీకుల ఆధ్వర్యంలో ఆదిశంకరుల వారి జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన సాంబశివరావు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఆదివారం దాత స్వామివారి దర్శనార్థం విచ్చేసి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ అధికారులు దాతకు స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందనలో భాగంగా అర్జీలను స్వీకరిస్తామన్నారు. ప్రజలు సమస్యలుంటే నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చునని ఆయన పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం కేసులో మహిళ అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం కేసులో ఓ మహిళను ఎస్ఈబీ అధికారులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంగారుపాళ్యం మండలంలో కర్ణాటక మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో చిల్లగుండ్లపల్లికి చెందిన ధనలక్ష్మి (46) అనే మహిళ నుంచి కర్ణాటక మద్యం పట్టుబడింది. 13 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్టయ్య, వెంకటేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవిలో కా'పాడి'





ఆరుబయట ఎండలో ఉన్న పాడి ఆవులు, (ఇన్‌సెట్) మండల పశుసంవర్థక శాఖ ఏడీ పద్మావతి

ఐరాల: వేసవిలో పాడి రైతులు పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్థక శాఖ వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్తున్నారు. వడదెబ్బ తగిలిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా, ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయిని మండల పశుసంవర్థక శాఖ ఏడీ పద్మావతి పేర్కొన్నారు. వేసవి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులను ఏడీ వివరించారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై ఒక్కొక్కసారి పశువులు చనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పశువైద్యశాలకు వెళుతున్న పాడి రైతులకు ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నారు.

వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలు

పశువులు తాగే నీరు పరిశుభ్రంగా ఉంచాలి. వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారతాయి. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధి బారినపడతాయి. రోజులో కనీసం నాలుగు సార్లు స్వచ్ఛందంగా ఉన్న నీటిని అందించడం అవసరం. ఆరుబయట తొట్టిలో పగలు నిల్వ ఉంచిన నీరు వేడిగా మారతాయి. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటిని పశువులకు తాగించాలి. ఆవుతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయస్సు ఆధారంగా రోజుకు 35 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే ఆవులు అదనంగా ప్రతి లీటర్ పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి.

వడదెబ్బ తగలకుండా..

పశువుల పాక చుట్టూ పాత గోనెసంచులు, పంచెలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాతరేకులతో వేసినట్టయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకు, వరి గడ్డితో కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేటట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే చల్లని వాతవరణంలో మేతకు వదలాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి.

వడదెబ్బ తగిలితే లక్షణాలు..

శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కొక్కసారి కిందపడి కొట్టుకొని స్పృహకోల్పోతాయి. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పతి కోల్పోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించి, దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించాలి.

వడదెబ్బ తగిలితే చేయాల్సిన చికిత్స..

వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. పలుచటి వస్త్రంలో ఐస్ చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి. కొద్దిగా ఉపశమనం కలిగిన తరువాత దగ్గరలోని పశు వైద్యుడిని సంప్రదించి, వైద్యుల సూచించిన సెలైన్ పెట్టాలి. అనంతరం వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి.

మౌలిక వసతుల కల్పనకు కృషి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానికంగా మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గంగనపల్లె శివారు ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల సంక్షేమ లబ్ధిని లబ్ధిదారులకు వివరించి బుక్‌లెట్స్ అందజేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సంవత్సరాలుగా మట్టిరోడ్డుతో ఇబ్బందిపడుతున్నామని సీసీ రోడ్డు వేయించాలని స్థానికులు విన్నవించారు. అదేవిధంగా తాగునీటి సమస్య ఉందని పైప్‌లైన్ వేయాలని అభ్యర్థించారు. పలు వీధుల్లో కాలువలు లేకపోవడంతో మురుగునీరు ఇంటి ముందు నిల్వ చేరుతోందని, కొత్తగా డ్రైనేజీ నిర్మించాలని డివిజన్ వాసులు ఎమ్మెల్యేను కోరారు. వీధిలో విద్యుద్దీపాలు ఏర్పాటుచేయాలన్నారు. సంబంధిత సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం సచివాలయంలో ఆ ప్రాంతవాసులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. డివిజన్‌లో ఉన్న సమస్యలు వాటి పరిష్కారమార్గాలపై చర్చించారు. డివిజన్ ఇన్‌చార్జిలు గుర్రప్పనాయుడు, శ్రీరాములు, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, నేతలు కిరణ్, రఘురాం, వినాయక బాలాజి, రమణ, గుణ, మనోహర్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన



గ్రామస్తులకు కరపత్రం అందజేస్తున్న లోకేష్‌రెడ్డి,



కొనాపల్లెలో..

పూతలపట్టు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోందని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బండపల్లి పంచాయతీలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పరంగా గత టీడీపీ పాలనకు, జగనన్న ప్రభుత్వ పాలన మధ్య తేడాను వివరించారు. అనంతరం కరపత్రాలను, స్టికర్లను అనుమతితో ఇంటింటికి అంటించారు. అభయ సాయి సంస్థ అధినేత లోకేష్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, ఎంపీటీసీ యతీష్, సర్పంచ్ త్యాగరాజులు, వైస్ సర్పంచ్ జ్యోతి, షణ్ముగం, ఎంస్ మణి, సచివాలయ కన్వీనర్ జ్యోతీశ్వర్, రోజమ్మ, మునిస్వామి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

యాదమరి: జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని యాదమరి ఎంపీపీ సురేష్‌బాబు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని కొనాపల్లె, పెరియంబాడి పంచాయతీ గ్రామాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. రాబోయే ఎన్నికలలో మరోసారి జగనన్నను ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు మాదిరెడ్డి పల్లె మనోహర్‌రెడ్డి, ఆనంద్, గజేంద్ర పాల్గొన్నారు.

నరహరిపేటలో టూ డిపో బస్సులకు స్టాపింగ్

గుడిపాల: గుడిపాల మండలంలోని నరహరిపేట వద్ద చిత్తూరు-2 డిపో బస్సులు ఆదివారం నుంచి నరహరిపేటలో ఆగుతున్నాయి. ఇంతకుముందు ఇక్కడ చిత్తూరు వన్‌డిపో బస్సులు మాత్రమే ఆగేవి. రెండురోజుల క్రితం టూ డిపో మేనేజర్‌కు గుడిపాల మండల ప్రజలు నరహరిపేటలో స్టాపింగ్ ఏర్పాటుచేయాలని వినతిపత్రం అందించారు. దీంతో ఆదివారం నుంచి చిత్తూరు-2డిపోకు చెందిన బస్సులకు స్టాపింగ్ కల్పించారు.

వినాయకుని దర్శించుకున్న తెలంగాణ డిప్యూటీ స్పీకర్



పద్మరావుగౌడ్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న కడప ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని తెలంగాణ డిప్యూటీ స్పీకర్ పద్మరావుగౌడ్ ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మరావు గౌడ్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. వీరితో పాటు కడప ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

చదరంగం మేధాశక్తిని పెంచుతుంది



మాట్లాడుతున్న శ్రీధర్

చిత్తూరు కలెక్టరేట్: చదరంగం క్రీడ మేధాశక్తిని పెంచుతుందని తద్వారా చదువులో రాణిస్తారని న్యూయార్క్ పాఠశాల వైస్ చైర్మన్ శ్రీధర్ అన్నారు. ఆదివారం స్థానిక గిరింపేటలో ఉన్న అసోసియేషన్ భవనంలో చిత్తూరు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చందరంగం సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన ఆయన పోటీలను ప్రారంభించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ కొత్త ఆలోచనలను చదరంగం క్రీడ దోహదం చేస్తుందని తెలిపారు. అసోషియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికత పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో కొత్త ఆవిష్కరణలకు, సరికొత్త ఆలోచనలకు చదరంగం ఎంతో దోహదం చేస్తుందన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చదరంగం క్రీడలో పాల్గొంటే ఆత్మస్థైర్యం పెంపొందుతుందని తెలిపారు. నగరంలోని విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పూతలపట్టు: పూతలపట్టు మండలంలో ఆదివారం నియోజకవర్గస్థాయిలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ గురుకుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చీఫ్ ఎగ్జామినర్ సీఎస్ ప్రసాద్ అన్నారు. ఈ పరీక్షలు పూతలపట్టులోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల కేంద్రంలో జరిగాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్షలు జరిగాయన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పగడ్బందీగా జరిగిన పరీక్షల సమయంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్ఐ హరిప్రసాద్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు పానీయాలు వంటి అత్యవసర వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఐదు మండలాల నుంచి బాలురు, బాలికలు హాజరైనట్లు తెలిపారు. 5 తరగతి ప్రవేశ పరీక్షకు 143 మందికిగానూ 110 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 104 మందికి 96 మంది హాజరైనట్లు తెలిపారు. నియోజకవర్గస్థాయిలో పరీక్షలు వ్రాసిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో సీట్లు కేటాయిస్తారని ఆయన విలేకరులతో పేర్కొన్నారు.

2, 3 తేదీలలో తిరుపతి గంగమ్మ జాతర



తిరుపతి గంగమ్మ

యాదమరి: మండల కేంద్రంలో మే 2, 3 తేదీలలో తిరుపతి గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో సమావేశం నిర్వహించారు. మే1న సోమవారం సాయంత్రం ముత్యాలమ్మ ఊరేగింపు, 2వ తేదీ మంగళవారం ఉదయం తిరుపతి గంగమ్మ విశ్వరూపం ప్రతిష్ఠించి జాతరను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేరోజు ప్రజలు పూజలు చేయనున్నట్లు తెలిపారు. 3వ తేదీ బుధవారం అమ్మవారి విశ్వరూపాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నట్లు వివరించారు.

వనసంరక్షణ సమితికి విరాళం



చెక్కును అందజేస్తున్న గౌహతి

పూతలపట్టు: పూతలపట్టు మండలం అనంతాపురం గ్రామంలోని పీఎస్ఆర్ వనసంరక్షణ సమితి అభివృద్ధి కోసం పలువురు ప్రముఖులు విరాళం అందజేశారు. ఆదివారం తేజస్వి డెయిరీ అధినేత గౌహతి, నీరదాక్షనాయుడు కలిసి ఆటస్థల ప్రెసిడెంట్ సుధీర్‌కుమార్‌కు రూ.లక్ష చెక్కును అందజేశారు. ఆమె మాట్లాడుతూ దివంగత నేత సుబ్బారెడ్డి చేసిన సేవలు నిలిచిపోకుండా వాటిని తాను ముందుండి నిర్వహిస్తానని తెలిపారు. సర్పంచ్ మాసిలామణి, గుణేశ్వర్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, పట్టాభిరామ్మూర్తిరెడ్డి, పెనుమూరు మండల అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, గోవిందరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, విద్యాసాగర్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం



మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు

చిత్తూరు రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీలో ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్ మణినాయుడు అన్నారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పోటీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూడా 175 నియోజకవర్గాలలో ఆమ్ ఆద్మీ పోటీకి సిద్ధమవుతోందని, మరో మూడు నెలల్లో బూత్ లెవెల్ నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని పదవులకు సభ్యులను ఎన్నిక చేయనున్నట్లు వెల్లడించారు. సభ్యులు వెంకటాచలపతి, ఆర్కే పట్నం నరేష్, వెంకటేష్, అనురాధ, రాజేష్ రాయల్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



కీర్తనలను ఆలపిస్తున్న మధుసూదనరావు

తవణంపల్లె: మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞాన సదస్సులో భాగంగా ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి ధ్యానులను అలరించింది. టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు ఆస్థాన సంగీత విద్వాంసులు గురుజాడ మధుసూదనరావు నేతృత్వంలో ఆయన శిష్యబృందం తాళ్లపాక షణ్ముగం, సుబ్రమణి, వాణి, పద్మప్రియ, గుణవతి అన్నమయ్య కీర్తనలతో ధ్యానులను రంజింపజేశారు. జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక, డాక్టర్ లోహిత్‌కుమార్, పవిత్ర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత పోటీలు



శాస్త్రీయ సంగీత పోటీలు

చిత్తూరు రూరల్: నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం ప్రజాహిత సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీత పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి 60 మంది యువతీయువకులు ఈ పోటీలకు హాజరయ్యారు. శాస్త్రీయ సంగీతంతో ఆహూతులను అలరించారు. ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని నిర్వాహక సంస్థ అధ్యక్షుడు రాజరత్నంరెడ్డి తెలిపారు.

రామాలయానికి గరుడ వాహనం



నూతన గరుడ వాహనం

చిత్తూరు రూరల్: చిత్తూరులోని కోదండరామస్వామి ఆలయానికి నూతన గరుడ వాహనాన్ని తయారు చేయించారు. భక్తుల సహాయ సహకారాలతో చేయించిన గరుడ వాహనాన్ని ఇకపై ప్రతి పౌర్ణమికి నగరంలో ఊరేగించనున్నారు. భక్తులు కోరితే వాహనసేవను వారి ఇంటి వద్దకే తీసుకెళ్లేలా నిర్ణయం తీసుకున్నామని ఆలయ అర్చకులు వేణుగోపాల్ పేర్కొన్నారు.

తస్మాత్ జాగ్రత్త!

- అప్రమత్తతతోనే వేసవి చోరీల నివారణ
- తాళాలు వేసే ఇళ్లపైన దొంగల నిఘా
- ప్రయాణాలు చేసేముందు పోలీసులకు సమాచారం తప్పనిసరి
- ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి.. పోలీసులు



గుడిపాల పోలీస్‌స్టేషన్

గుడిపాల: వేసవి సెలవులు వచ్చేశాయి. అయితే ఇంటిల్లిపాది దూరప్రాంతాలకు ప్రయాణాలు చేసే ముందు ఒక్కసారిగా వేసవిలో జరిగే దొంగతనాలపై అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు నెలలు పట్టణంతో పాటు గ్రామీణప్రాంతాల్లో దొంగతనాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా తాళాలు వేసి ఆరు బయట నిద్రించే వారి ఇళ్లపై దొంగలు నిఘావేసి సొత్తును కొల్లగొట్టేందుకు పక్కాగా స్కెచ్ వేస్తారు. అయితే అటువంటి దొంగతనాలు జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ పోలీసులు అందజేసే సూచనలు పాటించాలని పోలీస్ సిబ్బంది చెబుతున్నారు.

వేసవిలో దొంగతనాలపై జాగ్రత్త:

- వేసవి సెలవుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందజేయాలి.
- అలాగే పట్టణంలో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కొత్తవ్యక్తులు సంచరిస్తే తక్షణమే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలి.
- వేసవిలో ఎక్కువ మంది ఆరుబయట నిద్రించేందుకు ఆసక్తి చూపుతారు. అటువంటి ఇళ్లల్లో వీలైన మేరకు విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరిస్తే మంచిది.
- అలాగే మెరుగు పేరుతో ఎవరైనా సంచరిస్తే వారి వలలో చిక్కుకుని మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో గస్తీలు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ప్రజలు సహకరించాలి.
- గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు జరిగినా తక్షణమే పోలీసులకు యువత తెలియజేయాలి.

సమాచారంలో ఇళ్లు భద్రం:

వేసవిలో కుటుంబం మొత్తం 2, 3రోజులపైన ఊర్లకు వెళ్లేవారు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తే, ఆ ఇంటికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భద్రత అందజేస్తారు. ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సదుపాయంతో పూర్తిస్థాయిలో నిఘా వేస్తారు.

పనిచేసే విధానం ఇలా:

స్మార్ట్‌ఫోన్ ఉన్న ఇంటి యజమానులు ముందుగా ప్లేస్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీంతో ఆరు అంకెల కోడ్ సంబంధిత యజమానికి వస్తుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి పూర్తి వివరాలు నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరతాయి. ప్రయాణాలకు వెళ్లే సమయాల్లో ముందురోజు ఆరు అంకెల కోడ్‌ను రిక్వెస్ట్ పోలీస్‌వాచ్ ఆప్షన్‌లో నమోదు చేసుకుంటే, సమీప పోలీస్ సిబ్బంది ఆయా ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరాలను అమర్చుతారు. దీంతో ఆ ఇల్లు పూర్తిగా పోలీస్ విభాగం కంట్రోల్‌కు చేరుతుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో ఆగంతకులు ప్రవేశిస్తే నేరుగా కంట్రోల్‌రూమ్ వద్ద ఉన్న అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుంటారు. ఈ విధంగా ఆ ఇంటికి భద్రత ఏర్పడుతుంది. అంతేగాకుండా దొంగతనాలను పూర్తిగా నిరోధించవచ్చునని పోలీసులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



వేసవిలో జరిగే దొంగతనాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగినా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వేసవి సెలవుల్లో క్యాంపులకు వెళ్లే వారంతా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవచ్చు. అలాగే ఇంట్లో విలువైన వస్తువులు లేకుండా భద్రపరచుకోవాలి. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే 9440796712 నంబర్‌కు సమాచారం అందించాలి.

–రాజశేఖర్, ఎస్ఐ, గుడిపాల